

18న సీఎల్పీ సమావేశం

బెంగళూరు, జులై 15 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలపై దీటుగా స్పందించడంతోపాటు కీలకమైన విషయాలపై సమగ్రంగా చర్చించేందుకు కాంగ్రెస్ లెజిస్లేచర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈనెల 18న సాయంత్రం 6.30 గంటలకు ర్యాడిసన్ బ్లూ హోటల్‌లో లెజిస్లేచర్ భేటీ ఉంటుందని సీఎల్పీ కార్యదర్శి అల్లమప్రభు పాటిల్ ప్రకటించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులందరూ హాజరు కావాలన్నారు. సీఎం సిద్ధరామయ్య అధ్యక్షతన లెజిస్లేచర్ భేటీ జరుగుతుందని, డీసీఎం డీకే శివకుమార్, పరిషత్ సభా నాయకుడు ఎన్ఎస్ బోసరాజు పాల్గొంటారని పేర్కొన్నారు.

అట్టుడికిన పరిషత్

- వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అక్రమాలపై అధికార, ప్రతిపక్ష సభ్యుల వాగ్వాదం
- రేషన్‌కార్డుల మంజూరుపైనా నిలదీత
- 'ముడా' అవినీతిపై శాసనసభలో చర్చకు డిమాండ్
- వ్యూహాత్మకంగా వ్యవహరించిన ప్రతిపక్షాలు



శాసనసభలో ప్రసంగిస్తున్న సీఎం సిద్ధరామయ్య



కొలువుదీరిన శాసనసభ



ప్రసంగిస్తున్న ప్రతిపక్షనేత అశోక్

16 మంది కొత్త ఎమ్మెల్సీల పరిచయం

బెంగళూరు, జులై 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వివిధ విభాగాల ద్వారా ఎన్నికై పరిషత్‌లో ప్రవేశించిన 16మందిని సభా నాయకుడు బోసరాజు పరిచయం చేశారు. పరిషత్ కార్యకలాపాలలో తొలిరోజు సంతాప తీర్మానం తర్వాత సభాపతి సూచన మేరకు సభా నాయకుడు పరిచయం చేశారు. వీరిలో కె. గోవిందరాజు, ఐవాన్ డిసౌజా, రవికుమార్, ఎస్ఎల్ బోజేగౌడ, చంద్రశేఖర్ పాటిల్, సీటీ రవి, డాక్టర్ యతీంద్ర, జగదేవ్ గుత్తేదార్, జవరాయగౌడ, బల్కిస్ బాను, జీఎం ములె, వసంతకుమార్, జీటీ శ్రీనివాస్, కె. వివేకానంద, రామోజిగౌడ, ధనంజయ్ సర్జి, బసనగౌడ బాదర్లి ఉన్నారు.

బెంగళూరు, జులై 15(ఆంధ్రజ్యోతి): శాసనసభ వర్షాకాల సమావేశాల ప్రారంభం రోజే ప్రతిపక్షాల వ్యూహాత్మక నిర్ణయాలతో ఉభయసభలు అట్టుడికాయి. శాసనసభ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకే ఉభయసభలు ప్రారంభం కావాల్సి ఉన్నా శాసనసభలో కోరం లేని కారణంగా ఆలస్యమైంది. శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్ సభలో ప్రవేశించగానే సంతాప తీర్మానాలు ప్రవేశపెట్టారు. పరిషత్‌లో సభాపతి బసవరాజ హొరట్టి సంతాప సందేశాలపై చర్చకు పిలుపునిచ్చారు. పరిషత్‌లో కొత్త సభ్యుల పరిచయం చేయించారు. 16 మంది సభ్యులు ఇటీవల వివిధ కేటగిరీలలో జరిగిన ఎన్నికల ద్వారా పరిషత్ సభ్యులయ్యారు. వీరిలో సభా నాయకుడు బోసరాజుతోపాటు గోవిందరాజు, రవికుమార్ రెండోసారి సభలో కొనసాగినవారు కాగా మిగిలినవారు కొత్తవారు ఉన్నారు.

శాసనసభలో ముడా అవినీతిపై...

శాసనసభలో సంతాప తీర్మానాలు ముగియగానే ప్రతిపక్ష బీజేపీ సభ్యులు ముడా అవినీతిపై చర్చకు డిమాండ్ చేశారు. వాయిదా తీర్మానం కోరుతూ పట్టుబట్టారు. ప్రశ్నోత్తరాలకు ముందే వాయిదా తీర్మానానికి అవకాశం లేదని స్పీకర్ తిరస్కరించారు. వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ప్రతిపక్ష సభ్యులు ప్రస్తావించారు. ప్రశ్నోత్తరాలలో బాబా సాహెబ్ పాటిల్ రాష్ట్రంలో కొత్త తాలూకాల్లో ఎంతమంది సర్వేయర్లు ఉన్నారో వివరాలు తెలపాలని ప్రశ్నించారు. రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ వివరణ ఇచ్చారు. కౌజలగి మహంతేశ్ శివానంద వాయువ్య కర్ణాటక బైలహొంగల డిపోలో బస్సుల వివరాలు కోరారు. నంజనగూడు నియోజకవర్గంలో హాస్టళ్లు శిథిలావస్థకు చేరాయని దర్శన్ ధ్రువనారాయణ ప్రస్తావించారు. సభ్యుడు బరమగౌడ అలగౌడ కాగె మాట్లాడుతూ బెళగావి జిల్లా కాగవాడ పరిధిలో కృష్ణానదిలో చేపల పెంపకాన్ని ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. ప్రశ్నోత్తరాలు ముగిశాక ముడా అంశంపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కలాపాలు సజావుగా సాగే పరిస్థితి లేకపోవడంతో మంగళవారం ఉదయం 9.30 గంటలకు సభను వాయిదా వేశారు.

పోడియంలోకి సభ్యులు

పరిషత్‌లో వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతిపై చర్చకు అవకాశం ఇవ్వాలని బీజేపీ, జేడీఎస్ సభ్యులు పట్టుబట్టారు. సభాపతి అవకాశం ఇవ్వకపోవడంతో సభ్యులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పోడియంలోకి దూసుకెళ్లి సభా కార్యకలాపాలు నడవకుండా అడ్డుకున్నారు. గంటల తరబడి సభ్యులు నిరసన కొనసాగించడంతో కార్యకలాపాలు కొనసాగలేదు. సభాపతి పలు సందర్భాలలో ప్రతిపక్ష సభ్యులను సభ సజావుగా సాగేందుకు సహకరించాలని కోరారు. సభ్యులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో సభను మంగళవారం ఉదయం 10.30 గంటలకు వాయిదా వేశారు.

కొత్త హంగులతో శక్తిసౌధ ప్రధాన ద్వారం

శక్తిసౌధ ప్రధాన ద్వారాన్ని కొత్త హంగులతో తీర్చిదిద్దారు. కెంగల్ హనుమంతయ్య నిర్మించిన శక్తిసౌధ 68 ఏళ్ల తర్వాత అద్భుతం అనిపించేలా ప్రధాన ద్వారాన్ని మార్చారు. అంతర్జాతీయస్థాయిలో ప్రసిద్ధి చెందిన సుందర వాస్తుశిల్ప కట్టడం అనేది విధానసౌధకు పేరుంది. ప్రస్తుతం వీఐపీలు, మంత్రులు వచ్చే పశ్చిమ ద్వారాన్ని సంప్రదాయశైలి కలపతో అలంకరంగా తీర్చిదిద్దారు. గండభేరుండ ఆకృతిలో గడియారాన్ని ఏర్పాటు చేశారు. సీఎం సిద్దరామయ్య కొత్తగా ఏర్పాటు చేసిన ప్రధాన ద్వారాన్ని ఆవిష్కరించారు. శాసనసభలో సభ్యుల ప్రవేశం, నిష్క్రమణను గుర్తించేలా ఆర్టిఫిషియల్ కెమెరాలను ఏర్పాటు చేశారు. సభాప్రాంగణం కొత్తదనాన్ని సంతరించుకుంది.



సభాపతి హొరట్టి నమస్కారం

పరిషత్‌లో వాల్మీకి కార్పొరేషన్ అక్రమాలపై...



సీఎం, డీసీఎం చర్చలు

పరిషత్‌లో సంతాప తీర్మానాలు ముగియగానే సభ్యుడు సీటీ రవి వాయిదా తీర్మానంపై ప్రాథమికంగా ప్రస్తావించేందుకు డిమాండ్ చేశారు. సభ్యులు నమోశి, రవికుమార్, అరుణ్‌తోపాటు పలువురు ఇదే అంశంపై మాట్లాడారు. అంతలోనే కాంగ్రెస్ తరపున యూబీ వెంకటేశ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రశ్నోత్తరాల నిబంధనలను పాటించకుండా వాయిదా తీర్మానం సరికాదన్నారు. అధికార, ప్రతిపక్ష సభ్యులు వాగ్వాదానికి దిగడంతో సభాపతి హొరట్టి జోక్యం చేసుకుని ప్రశ్నోత్తరాలు ముగిశాకనే వాయిదా తీర్మానానికి సంబంధించి అంశంపై వివరణ ఇస్తానని తెలిపారు. అందుకు ప్రతిపక్ష సభ్యులు శాంతించినా సభా నాయకుడు మంత్రి బోసరాజు మాత్రం వాయిదా తీర్మానానికి వీలు లేదని నిబంధనల పుస్తకాన్ని తీసుకొచ్చారు. ఈలోగా ప్రశ్నోత్తరాలు ప్రారంభించారు. కొత్త రేషన్‌కార్డుల కోసం లక్షలాదిమంది దరఖాస్తు చేసుకున్నారని, వారికి సముచిత న్యాయం చేయాలని ప్రతాప్‌సింహనాయక్ డిమాండ్ చేశారు. పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి మునియప్ప వివరణ ఇస్తూ.. 3,22,483 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, బెళగావిలో అత్యధికంగా 32వేలు, కలబురగిలో 26వేలు, విజయపురలో 24వేలు, బెంగళూరులో 13వేల దరఖాస్తులు ఉన్నాయని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా తాలూకా, జిల్లా ఆసుపత్రుల్లో, ఆయుష్ ఆసుపత్రులలో అడ్మిషన్లు ఉన్నాయా అంటూ సభ్యుడు హూజార్ లేవనెత్తిన అంశానికి మంత్రి దినేశ్ గుండూరావు సమాధానమిచ్చారు. నీట్ పరీక్షలపై రాష్ట్ర విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని కాంగ్రెస్ సభ్యుడు ఐవాన్ డిసౌజా లేవనెత్తిన ప్రశ్నకు వైద్యవిద్యాశాఖ మంత్రి శరణప్రకాశ్‌పాటిల్ వివరణ ఇచ్చారు. రాష్ట్రంలో 24 ప్రభుత్వ, 47 ప్రైవేట్ మెడికల్ కళాశాలలు ఉన్నాయని, వీటిలో 12,045 మెడికల్ సీట్లకు అవకాశం ఉందన్నారు.



పరిషత్ సంతాప సభలో పాల్గొన్న సభ్యులు తదితరులు

ఉభయసభల్లో ప్రముఖులకు సంతాపం

బెంగళూరు, జులై 15(ఆంధ్రజ్యోతి): శాసనసభ కార్యకలాపాలు ప్రారంభం కాగానే ఇటీవల మృతి చెందిన ప్రముఖులకు సంతాపం తెలిపే తీర్మానాన్ని శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్ ప్రవేశపెట్టారు. పాటిల్ సునందాగౌడ, మాజీ డిప్యూటీ స్పీకర్ నాగమ్మ కేశవమూర్తి, మాజీ ఎంపీ శ్రీనివాసప్రసాద్, మాజీ ఎమ్మెల్యే, ఎంపీ సీపీ మూడలగిరియప్ప, మాజీ మంత్రి కేశవమూర్తి, మాజీ ఎమ్మెల్యే వసంతబంగేరా, డాక్టర్ పాటిల్ బసనగౌడ గురనగౌడ, నాగిరెడ్డి పాటిల్, రమేశ్‌కుమార్ పాండే, టీహెచ్ శివశంకరప్ప, వాసు, ప్రముఖ నటుడు నిర్మాత ద్వారకేశ్, సాహితీవేత్త కమలా హంపన, నటి, యాంకర్ అపర్ణ, ధర్మగురు ఖాజి అసయ్యద్ ఫజల్ ఓయమ్మ తంజల్ అల్‌బుకారిలకు సంతాపం తెలిపారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ప్రతిపక్షనేత అశోక్, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రి మహదేవప్ప, తరికెరె శ్రీనివాస్, దర్శన్ ధ్రువనారాయణ, విజయేంద్రతోపాటు పలువురు సంతాపాలు వ్యక్తం చేశారు. పరిషత్‌లో కూడా కార్యకలాపాలు ప్రారంభం కాగానే సభాపతి బసవరాజహొరట్టి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సభా నాయకుడు బోసరాజు, ప్రతిపక్ష బీజేపీ తరపున నమోశి, సీటీ రవి సహా పలువురు సంతాపాన్ని తెలిపారు. మృతుల కుటుంబాలకు సంతాప సందేశాలను పంపుతామని సభాపతి ప్రకటించారు.



పరిషత్ వెల్‌లో సభ్యుల నిరసన



నేను పరారీ కాలేదు

- నాకు నోటీసులు రాలేదు
- రాయచూరు గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్

బెంగళూరు, జులై 15 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అధ్యక్షుడు, రాయచూరు గ్రామీణ కాంగ్రెస్ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ మూడు రోజులుగా అజ్ఞాతంలో ఉన్నారనే ప్రచారానికి స్వయంగా ఆయనే తెరదించారు. సోమవారం శాసనసభ సమావేశాలలో పాల్గొనేందుకు విధానసౌధకు వచ్చారు. ఇదే సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 'నేను పరారీ కాలేదు... నాకు నోటీసులు రాలేదు' అని స్పష్టం చేశారు. తాను ఊర్లోనే ఉన్నానని తెలిపారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతిలో మాజీ మంత్రి నాగేంద్రను ఈడీ అధికారులు అరెస్టు చేశారు. దీంతో కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఉన్న ఎమ్మెల్యే దద్దల్ కనిపించలేదని ప్రచారం సాగింది.

సీఎం రాజీనామా కోరుతూ.. విధానసౌధకు బీజేపీ ఎమ్మెల్యేల ర్యాలీ


వాల్మీకి విగ్రహానికి పుష్పాంజలి



బెంగళూరు, జులై 15 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతి వివాదంలో మాజీ మంత్రి నాగేంద్రను ఈడీ అధికారులు అరెస్టు చేశారని, ఇందుకు నైతిక బాధ్యత వహించి ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాజీనామా చేయాలని బీజేపీ ఎమ్మెల్యేలు నిరసన ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యేల క్వార్టర్స్ నుంచి విధానసౌధకు ప్లకార్డులతో పాదయాత్ర చేశారు. శాసకర భవన్‌లో వాల్మీకి విగ్రహానికి ప్రతిపక్షనేత అశోక్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర పూలమాలలు సమర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయేంద్ర మాట్లాడుతూ వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో రూ. 187 కోట్ల అవినీతి జరిగిందన్నారు. దళితుల సొమ్ము లూటీ చేశారని, గతంలో ఏ ప్రభుత్వమూ ఈ తరహాలో వ్యవహరించలేదన్నారు. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడాల్సిన ప్రభుత్వం అక్రమంగా ఎన్నికల కోసం ఉపయోగించారని ఆరోపించారు. సీఎం సిద్ధరామయ్యను వివాదం నుంచి తప్పించేందుకే మాజీ న్యాయమూర్తి కమిషన్ వేశారని పేర్కొన్నారు. గతంలో యడియూరప్పపై ఆరోపణలు వస్తే సిట్ దర్యాప్తునకు ఆదేశించి వీరికి మాత్రం న్యాయ తనిఖీలు సమంజసమా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి సత్తా ఉంటే సీబీఐ విచారణకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. సబ్‌ప్లాన్ నిధులు దళితుల సంక్షేమానికి కాకుండా గ్యారెంటీలకు మళ్లించారని ఆరోపించారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతిపై వాయిదా తీర్మానం కోరామని, సభలో చర్చిస్తామని తెలిపారు. విధానసౌధ ప్రాంగణం దాకా సీఎంకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. నిరసనలో ఎమ్మెల్యేలు మునిరాజు, అరవింద్ బెల్లద్, అరగ జ్ఞానేంద్ర, రామమూర్తి, గాలి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు సీటీ రవి, రవికుమార్, భారతిశెట్టి, అరుణ్ సహా పలువురు పాల్గొన్నారు.



ప్లకార్డులతో నిరసన ర్యాలీ



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1607.59	1,587.43
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	16,142	8,918
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	211	256
సామర్థ్యం (టీఎంసీలు)	33.07	9.02

ఇష్టారాజ్యంగా అక్రమకట్టడాలు

- నగరపాలక సంస్థ ఆదాయానికి గండి
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



బళ్లారి నగరపాలక సంస్థ కార్యాలయం

బళ్లారి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరపాలిక పరిధిలో అక్రమ కట్టడాలు అడ్డదిడ్డంగా వెలుస్తున్నాయి. ఏ మాత్రం నిబంధనలు పాటించకుండా భవన నిర్మాణాలు చేపడుతున్నా.. నగర పాలక అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిన్న ఇంటి నిర్మాణానికే పలు అడ్డంకులు చెప్పే అధికారులు మామూళ్లు ఇస్తే ఎంత ఇష్టారాజ్యంగా భవనాలు నిర్మించుకున్నా పట్టించు కోరని ప్రజలు మండిపడుతున్నారు. నగరపాలిక నిబంధనల ప్రకారం ఏదైనా భవనం గానీ, ప్రభుత్వ కార్యాలయంగానీ నిర్మించాలంటే.... దానిని ఎంత విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు? వాటిలో తీసుకుంటున్న భద్రతాచర్యలేవి? తదితర పూర్తి వివరాలు వివరిస్తూ ప్రభుత్వానికి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే అలాంటివేమీ పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా పలువురు వ్యవహరిస్తున్నారు. బళ్లారి నగరంలో అనేక ప్రాంతాల్లో అనుమతులు లేని భవనాలు వెలుస్తున్నాయి. విద్యానగర్, నెహ్రూ కాలనీ, హవంబావి, గుగ్గిరట్టి, కాకర్లతోట, రూపనగుడి రోడ్డు, హుస్సేన్ నగర్, ఇలా పలు ప్రాంతాల్లో చాలా భవనాలను నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తున్నారని ఆయా కాలనీవాసులు కొందరు గతంలో అధికా రులకు ఫిర్యాదులు కూడా చేశారు. పలు అంతస్తుల భవనాల నిర్మాణానికి కూడా ఇష్టారాజ్యంగా అనుమతులు ఎలా ఇస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. సిటీ కార్పొరేషన్ పరిధిలో భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలంటే బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు స్థలాల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఆ తరువాత అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు ముడుపులు తీసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహ రిస్తున్నారని నగరపాలిక సంస్థలో పనిచేసే కొందరు ఉద్యోగులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. అయితే అయిన వారికి ఆకుల్లో కాని వారికి కంచంలో అన్నట్లు కొందరు అధికారులు వ్యవహరిస్తున్నట్లు చర్చించుకున్నారు. ముడుపులు చెల్లించిన వారు ఇష్టారాజ్యంగా అనుమతులు పొందుతుం టే.... భవన నిర్మాణానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకున్న కొందరు అధికారులు అనుమతులు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే కొందరు భవన నిర్మాణాల ద్వారా రావాల్సిన రుసుమును చెల్లించని కారణంగా నగరపాలిక సంస్థ ఆదాయం కోల్పో తోంది. నగరంలో ఇరువైపులా భవనాలు ప్రతి యేటా విస్తరిస్తున్నా అందుకు తగిన ఆదాయం సంస్థకు రావడం లేదని నగరపాలక సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..

ఈ విషయంపై నగరపాలక సంస్థ కమిషనర్ ఖలీల్ మాట్లాడుతూ.. నగర పాలక సంస్థ పరిధిలో కొందరు అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపడుతున్నది వాస్తవమే అని అన్నారు. అనుమతులు లేకుండా చేపట్టిన భవన నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిర్మాణానికి అవసరమైన నగరపాలక సంస్థ అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. ప్రస్తుతం ఉన్న భవనాలు ఎన్ని? వాటి నుంచి వస్తున్న ఆదాయం ఎంత? తదితర అంశాలపై విచారిస్తామన్నారు. పన్ను చెల్లించని భవన నిర్మాణ దారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా మొహరం వేడుకలు



పీర్లను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, జూలై 15: మొహరం పురస్కరించుకుని తాలుకాలోని అగసనూరులో నిర్వహిస్తున్న వేడుకలకు ఎమ్మెల్యే బీఎం నాగరాజు సోమవారం హాజరయ్యారు. గ్రామానికి వెళ్లిన ఆయన పీర్లను దర్శించుకున్నారు. అగసనూరులో అనాదిగా మొహర్రం వేడుకలను ఎంతో సంప్రదాయ బద్ధంగా నిర్వహిరించడం ఆనవాయితీ. ఈ కారణంగా ఎమ్మెల్యే నాగరాజుతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపాల్ రెడ్డి, బీజీ మంజునాథరెడ్డి, పవన్‌కుమార్ దేశాయ్, గణేష్, కార్యకర్తలు పీర్లను దర్శించుకున్నారు.

'రక్తదానం చేసి ప్రాణదాతలు కండి'



దాతల నుంచి రక్తం సేకరిస్తున్న డాక్టర్ లక్ష్మి

సిరుగుప్ప, జూలై 15 : రక్తదానం చేసి, ప్రాణదాతలు కావాలని అచ్చొళ్లి ప్రభుత్వాస్పత్రి వైద్యురాలు డాక్టర్ లక్ష్మి పిలుపు నిచ్చారు. తాలుకాలోని అచ్చొళ్లి గ్రామంలో సోమవారం గ్రామస్థులు, ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ లక్ష్మి యువకుల నుంచి రక్తాన్ని సేకరించారు. రక్తదానం చేయడం వలన అవసరమైన సమయంలో మరొకరి ప్రాణాలు కాపాడేందుకు అవకాశం ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకుడు లింగరాజరెడ్డి, వైద్యులు రవికుమార్, గ్రామ ప్రముఖులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన రాగరంగ్ సంగీత కచేరీ



శాస్త్రీయ సంగీతం ఆలపిస్తున్న కళాకారులు

బళ్లారి సిటీ,జూలై 15: నగరంలోని హవాంబావి విరాట్ నగర్‌లో ఉన్న గానయోగి కళాకేంద్రంలో సోమవారం శ్రీగురు పుట్టరాజ సంగీత పాఠశాల, బళ్లారి ఆధ్వర్యంలో రాగరంగ్ మాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం అందరినీ అలరించింది. జిందాల్ విద్యానగర్ పాఠశాల సంగీత అధ్యాపకులు కొట్రేశ్ గాన కచేరీలో సంగీత కళాకారులు శరణయ్య, స్వామి పెద్దబసవ గవాయి, కగ్గల్ సోమశేఖర్, నిరంజన్ పాల్గొన్నారు. హొస్పేట్‌కు చెందిన సుదన్వ గానానికి యోగీశ్ తబలావాయించారు. అనంతరం పలువురు చిన్నారులు శాస్త్రీయ గీతాలు ఆలపించారు.

నీరు కలుషితం కాకుండా చూడండి

జడ్పీ సీఈఓ రాహుల్ శరణప్ప



సమావేశంలో అధికారులకు సూచనలు ఇస్తున్న జడ్పీ సీఈఓ

బళ్లారి సిటీ, జూలై 15: ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో నీటి వనరులు కలుషితం కాకుండా చూడాలని జిల్లా పంచాయతీ కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప సూచించారు. ఎప్పటికప్పుడు పరీక్షించిన తర్వాతే తాగునీరు సరఫరా చేయాలన్నారు. కలుషిత నీటి వల్ల ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని, అప్రమత్తగా ఉండాలన్నారు. నగరంలోని జిల్లా పంచాయతీ కార్యాలయం భవ నంలో సోమవారం సీఈఓ అధ్యక్షతన ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా ఆరో గ్య సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. వర్షాకాలంలో పలు చోట్ల నీరు నిల్వ ఉంటుందన్నారు. వాటితో పాటు డ్రైనేజీల స మీపంలో పైపులైన్లు లీకేజీ అయితే వెంటనే ఆయా స్థానిక సంస్థలు, పంచాయతీ లకు సమాచారం ఇవ్వాలని అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీతో పా టు స్థానిక సంస్థల సహ కారంతో నిబంధనల ప్రకారం నీటిని క్లోరినేషన్ చేయా లని ఆదేశించారు. మొహరం వేడుకల కారణంగా ప్రజలు ఎక్కువగా గ్రామాలకు తరలివెళతారని, కావున తాగునీటి వినియోగంపై గ్రామీణులకు అవగాహన కల్పిం చాలన్నారు. ప్రజలు రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నీటి వనరుల వద్ద పశువులను కడగరాదని బట్టలు ఉతకకూడదని, వ్యర్థంగా కొళాయిలను వదలకూడదని గ్రామపంచాయతీల తో పాటు అన్ని స్థానిక సంస్థల్లో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి రమేశ్ బాబు మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలోని అన్ని ప్రధాన ఉత్సవాల సమయంలో కలరా నియంత్రణ బృందం హాజరై నీటి వనరులు, ఆహారపదార్థాల తయారీ స్థలం తదితరాలను పరిశీలించి, చర్యలు తీసుకుం టోందని తెలిపారు. సండూరు తాలూకాలోని నాగేనహళ్లిలో అనారోగ్య కేసులు అదుపులో ఉన్నాయి. వైద్య బృందాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నామ న్నారు. అపరిశుభ్రంగా ఉన్న నీటి వనరులను గ్రామపంచాయతీ, స్థానిక సంస్థల సహకారంతో పరీక్షించి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అంధత్వ నియంత్రణ, నవజాతశిశు సంరక్షణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అబ్దుల్లా, మరియంబి, ఇంద్రాణి, హనుమంతప్ప, వీరేంద్రకుమార్, తాలూకా ఆరోగ్య అధికారులు డాక్టర్ ఈరన్న, భరత్, పరూఖ్, జిల్లా ఆరోగ్య వైద్య అధికారి ఈశ్వర దాసప్పనవర్, జుబీన్‌తాజ్, గిరిశ్, వెంకోబనాయక్, మనోహర్, రాఘవేంద్ర, బసవరాజు, అర్చన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దొంగ అరెస్ట్

రూ. 8,26,500 విలువైన బంగారం స్వాధీనం



నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న నగలను చూపుతున్న పోలీసులు

బళ్లారి రూరల్, జూలై 15 : నగరంలోని గాంధీనగర్ పోలీస్ స్టేషన్ సమీపంలో తాళం వేసిన ఇళ్లల్లో గత కొద్ది రోజులుగా దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు గాంధీనగర్ పోలీసులు సోమవారం తెలిపారు. నగరంలోని తాళూరు రోడ్డు 16వ క్రాస్, రేణుకా నగర్‌కు చెందిన కురుబ కార్తీక్ బళ్లారి నగరంతో పాటు పలు ప్రాంతాల్లో దొంగతనాలు చేస్తూ ఉండేవాడు. బెంగళూరులో క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్న అతడు అప్పుడప్పుడు బళ్లారికి వచ్చి దొంగతనాలకు పాల్ప డేవాడు. ఈ క్రమంలో కప్పగల్ రోడ్డు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద ఉన్న ఒక అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న తన ఇంట్లో 245 గ్రాముల బంగారం ఆభరణాలు చోరీ అయినట్లు ఆ ఇంటి యజమాని ధనుంజయరెడ్డి గాంధీనగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా ఎస్పీ శోభారాణి, ఏఎస్పీలు రవికుమార్, నవీన్ కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ చోరీకి పలు విషయాలు పసిగట్టి నిందితుడు కురుబ కార్తీక్‌ను గుగ్గిరట్టి వద్ద అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి రూ. 8,26,500 విలువైన నగలు స్వాధీనం చేసుకున్నట్లు గాంధీ నగర్ పోలీసులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిటీ డీఎస్పీ చంద్రకాంత్ నందరెడ్డి, సీఐ సిద్ధరామేశ్వర్, నారాయణ స్వామి, హెడ్ కానిస్టేబుల్ జయరామ్, నారాయణ, తిమ్మప్ప, మారుతి, మంజునాథ్, పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఎస్పీని కలిసిన రైతు సంఘం నాయకులు



ఎస్పీ శోభారాణిని సన్మానిస్తున్న దృశ్యం

బళ్లారి రూరల్, జూలై 15 : నగరంలోని ఎస్పీ కా ర్యాలయంలో సోమవారం ప్రొఫెసర్ నంజుండస్వామి, కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి సింధిగేరి గోవిందప్ప నాయక్ తదితరులు ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన శోభారాణిని కలిసి అభినందనలు తెలిపారు. ఆమె కు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సింధిగేరి గోవిందప్ప మాట్లాడుతూ జిల్లాకు మొట్టమొదటి మహిళ ఎస్పీగా శోభారాణి వచ్చారన్నారు. జిల్లాలో శాంతి భద్రతలతో పాటు, ట్రాఫిక్ తదితర అంశాలపై ఎస్పీతో చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రంలో నాయకులు శ్రీనివాస్, లక్ష్మి, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

బియ్యం లారీ కిందపడి మహిళ మృతి

రాయచూరు, జూలై 15 : స్థానిక సివిల్ సప్లయ్ గోదాము నుంచి బియ్యంలోడ్‌తో వెళుతున్న లారీ కిందపడి ఓ మహిళ మృత్యువాతపడింది. నగరంలోని ఒపెక్ ఆస్పత్రి సమీపంలో ఉన్న సివిల్ సప్లయ్ గోదాము నుంచి సోమవారం సాయంత్రం బియ్యం లోడ్‌తో లింగసుగూరు వైపు వెళుతున్న లారీ స్థానిక అరబ్ మొహల్లా చౌరస్తా టిప్పుసుల్తాన్ సర్కిల్‌లో తిరుగుతోంది. ప్రమాదవశాత్తు ఓ మహిళ లారీ కింద పడి, అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు అక్కడ చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. నగరంలోని ఆజాద్‌నగర్‌లో నివశిస్తున్న చిన్నమ్మగా గుర్తించారు. భర్త సతీష్‌తో కలిసి బైక్‌పై వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతురాలి భర్త సతీష్‌కు లారీ చక్రం తగిలి కాలు నుజ్జునుజ్జైంది. ఆయనను రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్సలు అందించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గవియప్ప శ్రీకారం



బోరుబావి వేసేందుకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే గవియప్ప

బళ్లారి సిటీ, జూలై 15: విజయనగరం జిల్లా హొసపేట తాలూకాలోని గ్రామీణ ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గవియప్ప సోమవారం శ్రీకారం చుట్టారు. తాలూకాలోని రాంపూర్ మాగాణి, నరసాపురం మాగాణి, జాగీర్దార్ బండి గ్రామాలను ఆయన సందర్శించారు. రైతులకు అనుకూలంగా ప్రధాన రహదారి నుంచి వ్యవసాయ పొలాలను కలుపుతూ సుమారు 15 మాగాణి రోడ్ల కోసం స్థల పరిశీలన చేశారు. దీనిపై పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులతో చర్చించి రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. అలాగే పలు చోట్ల సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాలలకు మరమ్మతులు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ అందుబాటులో ఉన్న నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాలల మరమ్మతు పనులు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఇప్పితేరి గ్రామస్థుల విన్నపం మేరకు గ్రామంలో తాగునీటి సౌకర్యం కోసం బోరుబావిని తవ్వించేందుకు పూజ చేశారు. ఈ సందర్భంగా నాయకులు వినయ్‌శెట్టర్, రఘుకుమార్, అంజనప్ప, బసవరాజ్, తోటప్ప, పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేశ్, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శిక్షణలో ప్రాక్టికల్ అనుభవం అవసరం

విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ తిప్పేరుద్ర



పరుగు పందేన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న వీసీ తిప్పేరుద్ర తదితరులు

బళ్లారి సిటీ, జూలై 15: ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ డిపార్టుమెంట్ నందు శిక్షణ పొందే విద్యార్థులు వివిధ క్రీడల్లో ప్రాక్టికల్ అనుభవం పొందాలని విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి తిప్పేరుద్ర అన్నారు. అప్పుడే తాము పొందే శిక్షణలో పరిపూర్ణత్వం వస్తుందని అన్నారు. విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఇంట్రా స్కూల్ హిల్ పరుగుపందెం పోటీలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ... యూనివ ర్శిటీలో ఇలాంటి క్రీడా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ఎంపీఈడీ శిక్షణ పొందేవారు ప్రాక్టికల్ అనుభవం పొంది భవిష్యత్తులో బాగా రాణిస్తారని అన్నారు. యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ విభాగాధిపతి డాక్టర్ శశిధర మాట్లాడుతూ... శిక్షణార్థులు ముందుగా క్రీడాపోటీల్లో పాల్గొనేలా ప్రణాళిక ప్రకారం సిద్ధం కావాలన్నారు. అప్పుడే క్రీడల్లో విజయం సాధించగలరన్నారు. ఈ పరుగుపందెం పోటీల్లో పురుషుల విభాగంలో మల్లికార్జున ప్రథమ స్థానం స్థానం సాధించగా, చంద్రయ్య ద్వితీయ, సంతోష్‌కుమార్ తృతీయ స్థానాల్లో నిలిచారు. అలాగే మహిళల విభాగంలో పూజ ప్రథమ స్థానం, మహాదేవి ద్వితీయస్థానం, సునీత తృతీయస్థానం సాధించారు. అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమ తులను అందజేశారు. ఈ కార్యక్రమలో అసిస్టెంట్ ప్రొఫెసర్ సంపత్‌కుమార్, ఇంట్రామ్యూరల్ స్పోర్ట్స్ డైరెక్టర్ రాజేశ్, గెస్ట్ లెక్చరర్ మహేశ్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం చూపాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న టీఎన్‌పేట గ్రామస్థులు

పావగడ, జూలై 15 : తాలూకా పరిధిలోని టీఎన్‌పేట గ్రామంలో సర్వేనంబరు 422లో శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించాలని సోమవారం ఆ గ్రామస్థులు తహసీల్దార్ వరదరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సర్వేనంబరులో దాదాపు 60సంవత్సరాల నుంచి శ్మశానవాటికను అన్ని మతాలవారు ఉపయోగించుకుంటున్నారని అయితే ప్రస్తుతం కొన్ని అగ్రవర్ణాలవారు శ్మశానవాటికతోపాటు దాని పక్కనున్న భూమిని కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. దానిని వెంటనే ఆపివేయాలని వారు కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండెకరాల స్థలాన్ని వదిలి ఐదెకరాల వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ విషయాన్ని కోర్టులో కేసు నడుస్తున్నట్లు తెలిపారు. సబ్‌రిజిస్ట్రార్ దృష్టికి వచ్చినప్పుడు సమాచారం అందించి రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్థులు నారప్ప, రమేష్, నరసింహప్ప, రామప్ప, నారాయణప్ప తదితరులు వినతిపత్రం అందించినవారిలో ఉన్నారు.

హోసూరు జోన్

ప్రాథమిక పాఠశాలల్లో 'అల్పాహారం' ప్రారంభం



కీళ్‌చేరి సెయింట్ పాఠశాలలో అల్పాహార కార్యక్రమం ప్రారంభించిన కలెక్టర్ కేఎం సరయు

హోసూరు(కృష్ణగిరి), జూలై 15 : తమినాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదే శాల మేరకు సోమవారం తిరువళ్లూరు జిల్లా కడం బటూర్ పంచాయతీ యూనియన్, కీళ్‌చేరి సెం ఐంట్ ప్రభుత్వ సహాయక ప్రాథమిక పాఠశాలలో సోమవారం ముఖ్యమంత్రి అల్పాహార కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కేఎం సరయు ప్రారంభించారు. అనంతరం బర్గూరు పంచాయతీ యూనియన్ బాలేపల్లి పంచాయతీ, ఎలతగిరి సెయింట్ ఆంథోనిస్ ప్రాథమిక పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. పార్లమెంట్ సభ్యుడు కేపీ గోపినాథ్, బర్గూరు ఎమ్మెల్యే డి మతియళగన్ సమక్షం లో కార్యక్రమం ప్రారంభించి ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం వడ్డించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ర్థులకు ముఖ్యమంత్రి అల్పాహార పథకం కింద కృష్ణగిరి జిల్లా శూలగిరి పంచాయతీ యూనియన్‌ను మార్గదర్శక యూనియన్‌గా ఎంపిక చేశారు. యూనియన్‌లోని 42 పంచాయతీల పరిధిలో 133 పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాలల నుంచి 10, 302 మంది విద్యార్థులను ఎంపిక చేశా రు. అన్ని పాఠశాలల్లో పని దినాల్లో 5 తరగతి వరకు విద్యార్థులకు అల్పాహారం అందించనున్నారు. ఈ సందర్భంగా తమిళనాడు రాష్ట్ర జీవనోపాధి కార్యక్రమ డైరెక్టర్ పెరియసామి, జిల్లా కలెక్టర్ ఇంటర్వ్యూ అసిస్టెంట్ జీవి ప్రసన్న వెంకటేశన్, తమిళనాడు రాష్ట్ర జీవనోపాధి సహాయ కార్యక్రమ అధికారి గణేశ, జిల్లా ప్రాథమిక విద్యాశాఖాధికారి నరసింహన్, స్థానిక విద్యాశాఖాధికారి రాజేశ్వరి, రీజినల్ డెవలప్‌మెంట్ అధికారులు కళా, దురైస్వామి, పంచాయతీ కౌన్సిల్ ప్రెసిడెంట్ జాసిందా విలియం, స్కూల్ ప్రిన్సిపాల్ సిల్వియా ఆరోగ్యరాణి, ప్రిన్సిపాల్ ఫాదర్ దేవసహాయం, సూపరిం టెండెంట్ ఫాదర్ జేమ్స్, సెయింట్ ఆంథోని హైస్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ మార్టిన్, స్థానిక ప్రభుత్వ ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆషాఢ నవరాత్రి ఉత్సవాలు



నోట్ల అలంకరణలో వారాహి అమ్మవారు

హోసూరు, జూలై 15 : హోసూరులోని బ్రహ్మ కొండపై ఇన్నాక్షి పీఠంలో వెలసిన మహా వారాహి అమ్మన్ ఆలయంలో ప్రతి సంవత్సరం ఆషాఢ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఈ సందర్భంగా రోజూ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తుంది. ఈనెల 6 న పసుపు అలంకరణ, 7న కుంకుమ, 8న దానిమ్మ ముత్యాలతో అలంకరించారు. అలాగే 9 న నవకనియ, 10న పూలు, 11న తీపి పదార్థాలు, 12 న కూరగాయలు, దుంపలు, 13 పండ్ల అలంకారంతో దర్శనమిచ్చారు. ఈ నెల 14న మహా వారాహి అమ్మన్‌ను నాణెలు, కరెన్సీ నోట్లతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహిళలు పాటలు పాడుతూ నృత్యం చేశారు.

ఘనంగా కామరాజర్ జయంతి



కామరాజర్‌కు నివాళి అర్పిస్తున్న దృశ్యం

హోసూరు, జూలై 15 : ఐఎన్‌టీయూసీ కృష్ణగిరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్వాతంత్ర్య సమరయోధుడు కామరాజర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. నగరంలోని కామరాజ్ కాలనీలో ఉన్న ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఐఎన్‌టీయూసీ జాతీయ కార్య దర్శి మాజీ ఎమ్మెల్యే మనోహరన్ సూచన మేరకు జరిగిన కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి మునిరాజ్ అధ్యక్షత వహించారు. ఉపాధ్యక్షుడు భక్తవత్సలం, సంయుక్త కార్యదర్శులు శివకుమార్, పరంధామన్, నాయకులు కోదండరామన్, రత్నయ్య సెందిల్ కుమార్, మునిరాజ్, దినేశ్, చిన్నప్ప, రవికుమార్, సురేశ్, ప్రభాకరన్, తిమ్మరాయప్ప, ఎల్లప్ప, సతీష్, బాలాజీ, నవీన్, వేల్మురుగన్, నారాయణప్ప, రవి, మాదేశ్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాకు నమోదు చేసుకోండి

వ్యవసాయాధికారులు

హోసూరూ(సిప్‌కాట్) జూలై 15 : పంటల బీమాకు నమోదు చేసుకోవాలని హోసూరు మత్తిగిరి, బాగలూరు పిర్కాల పరిధిలోని అన్ని రెవెన్యూ గ్రామాల రైతులకు వ్యవసాయకశాఖ సహాయ సంచాలకులు ఓ ప్రక టనలో తెలిపారు. కృష్ణగిరి జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రా మాల రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ఖరీఫ్ సీజన్‌ల్లో సాగు చేసిన రాగి పంటల బీమాను పొంద వచ్చన్నారు. ఈ పథకం కింద పంటలు సాగు చేసిన రైతులు బజాజ్ అలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ పబ్లిక్ సర్వీస్ బ్యాంకులు లేదా ప్రైమరీ కో-ఆపరేటివ్ సొసైటీల ఆధీకృత ఏజెంట్ల ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. రాగి తదితర పంటల ప్రీమియంను ఆగస్టు 16 లోగా చెల్లించి లబ్ధి పొందాలన్నారు. నోటిఫైడ్ పంటల సాగు వల్ల కౌలు రైతులు లబ్ధి పొందవచ్చని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు తదితర కారణాల వల్ల పంట నష్టం జరిగితే బీమా అందిస్తారన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రాగి తదితర పంటలు సాగు చేస్తున్న రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారలు తెలిపారు.

ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తాం

- 18న కలెక్టరేట్ వద్ద ఆందోళన
- రైతు సంఘం గౌరవాధ్యక్షుడు చామరస మాలిపాటిల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చామరస మాలిపాటిల్

రాయచూరు, జూలై 15 : రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తు న్న రైతు, వ్యవసాయ వ్యతిరేక విధానాలను తాము తీవ్రంగా ప్రతిఘటిస్తామని కర్ణాటక రైతు సంఘం, హసిరు సేనల గౌరవాధ్యక్షుడు చామరస మాలిపాటిల్ అన్నారు. ఇందుకోసం ఈ నెల 18న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా అధికారి కార్యాల యాల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన సోమవారం విలేకరుల సమావేశం ఏర్పా టు చేసి మాట్లాడారు. వాల్మీకి అభివృద్ధి మండలిలో రూ.187 కోట్లకు పైగా అవినీతి, పంప్‌సెట్‌లకు రైతులు సొమ్ము చెల్లిం చే విధానంతో పాటు గత ఏడాది కొనుగోలు చేసిన జొన్నలకు సంబంధించి ఇప్పటికి రైతులకు చెల్లింపులు చేయకపోవడం తదితర వాటిని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న దాటివేత ధోరణిని తమ రైతు సంఘం తీవ్రంగా ప్రతిఘటిస్తుందన్నారు. కాగా గత బీజేపీ ప్రభుత్వం అనుసరించిన రైతు వ్యతిరేక విధానాలనే ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అనుసరిస్తుండడం దౌర్భాగ్యమన్నారు. గత ప్రభుత్వ విధానాలను ప్రతిపక్ష హోదాలో తూర్పారబట్టిన కాంగ్రెస్ నాయకులు తాము అధికారంలోకి వచ్చాక అవే విధానాలను అవలంబించడంతో పాటు పెద్ద ఎత్తున అవినీతిలో భాగస్వాములు కావడం సిగ్గుచేటన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే ప్రజల నుంచి తిరస్కారం తప్పదని హెచ్చరించారు. కాగా ఈ నెల 18న జిల్లాధికారి కార్యాలయం వద్ద తలపెట్టిన రైతు సంఘం ఆందోళనలో జిల్లాకు చెందిన రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

18న రుక్మిణీపాండురంగస్వామి రథోత్సవం

రాయదుర్గం రూరల్, జూలై 15: పట్టణంలోని శాంతినగర్‌లో వెలసిన రుక్మిణీ పాండురంగస్వామి దేవాలయంలో ఈ నెల 18వ తేదీన రథోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి పూజ సందర్భంగా ఉదయం 5 గంటలకు స్వామివారికి పంచామృతాభిషేకం, విష్ణుసహస్రనామావళి, కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించనున్నారు. అలాగు ఉదయం 7.30 గంటలకు స్వామివారికి పల్లకి ఉత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు భజన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ నెల 18వ తేదీన ఉదయం 8 గంటలకు పట్టణంలోని పురవీధుల్లో మేళతాళాలతో, భాజభజంత్రీలతో రుక్మిణీ పాండురంగస్వామి రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని తెలిపారు.

చిరుత దాడిలో మేక మృతి

మడకశిర రూరల్, జూలై 15 : మండలంలోని మెళవాయి గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో సోమవారం సాయంత్రం మేకల మందపై చిరుత దాడిచేసింది. అందులో ఒక మేక మృతి చెందినట్లు అటవీ శాఖ అధికారి శ్రీనివాసులు తెలిపారు. మెళవాయి గ్రామానికి చెందిన హనుమంతప్పకు 20 మేకలు ఉన్నాయి. మేత కోసం గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలోకి వెళ్లారు.సాయంత్రం మేకలతో ఇంటికి వస్తుండగా కొండలో ఉన్న చిరుత ఒక్కసారిగా మేకల మందపై దాడిచేసినట్లు తెలిపారు. మందు ఒక మేకను చిరుత చంపేసింది. సమీపంలోని రైతులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అటవీ అధికారులు కొండ ప్రాంతంలో చిరుత సంచరిస్తోం దని, అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. చనిపోయిన మేక రూ.20 వేలు ఉంటుందని రైతు తెలిపారు. అధికారులు త్వరగా బోను ఏర్పాటు చేసి చిరతను బంధించాలని కోరారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కుంచె...

డీకే పట్టమ్మాళ్ (వర్ధంతి)



పద్మవిభూషణ్ గ్రహీత ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు డీకే పట్టమ్మాళ్ 1919 మార్చి 19న తమిళనాడు రాష్ట్రం కాంచీపురంలో జన్మించారు. తమిళ సినిమాలకు నేపథ్యగాయనిగా రాణించారు. బాల్యం నుంచే గానాలాపనలో ప్రతిభను కనబరిచారు. ఎంఎస్ సుబ్బలక్ష్మి, ఎంఎల్ వసంత కుమారిలకు సమకాలీనులు. ఈ ముగ్గురూ కర్ణాటక సంగీతంలో స్త్రీరత్న త్రయంగా పేరొందారు. రాగం, తాళం, పల్లవిలలో రాణించారు. పద్మభూషణ్, గానసరస్వతి, సంగీత నాటక అకాడమీ పురస్కారాలు అందుకున్నారు. దేశ విదేశాలలో కచేరీలు నిర్వహించి సంగీతప్రపంచంలో ధ్రువ తారగా నిలిచారు. 2009 జూలై 16న కన్నుమూశారు.

పరమేశ్వర్ గోద్రెజ్ (జయంతి)



ప్రముఖ గోద్రెజ్ సంస్థ ఛైర్మన్ ఆది బుర్జోర్జి గోద్రెజ్ భార్య పరమేశ్వర్ గోద్రెజ్ 1945 జూలై 16న జన్మించారు. గోద్రెజ్ సంస్థ ఉన్నతికి పాటుపడడమే కాకుండా సంఘసంస్కర్తగా, పరోపకారిగా గుర్తింపు పొందారు. ఎయిరిండియాలో తొలి ఎయిర్ హోస్టెస్‌లలో ఒకరు. ఎయిడ్స్‌పై పోరాటానికి ప్రజలలో అవగాహన కల్పించేందుకు బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్, క్లింటన్ గ్లోబల్ ఇనిషియేటివ్స్ తదితర స్వచ్ఛంద సంస్థలతో కలసి పనిచేశారు. 2016 అక్టోబరు 10న కన్నుమూశారు.

కత్రినా కైఫ్ (పుట్టినరోజు)



బాలీవుడ్ హీరోయిన్ కత్రినాకైఫ్ 1983 జూలై 16న హాంగ్‌కాంగ్‌లో జన్మించారు. ఆంగ్ల మోడల్‌గా కాక దేశంలో అత్యధిక రెమ్యూనరేషన్ నటీమణిగా ఒకరు. 2003 నుంచి మోడల్‌గా, సినీరంగంలో తన సత్తా చాటుకుంటున్నారు. మోస్ట్ బ్యూటిఫుల్ సెలెబ్రిటీలలో ఒకరిగా నిలిచారు. 3 స్టార్‌డస్ట్ అవార్డులు, 4 జీ సినీ అవార్డులు, 4 స్క్రీన్ అవార్డులు, 1 ఐఐఎఫ్‌ఏ అవార్డు, 4 ఫిల్మ్‌ఫేర్, 2 స్టార్‌గిల్డ్ అవార్డులు ఇతర పురస్కారాలు అందుకున్నారు. నటుడు వికీ కౌశల్‌ను పెళ్లాడారు. లండన్‌లోని 'మేడమ్ టస్సాడ్' మ్యూజియంలో 'మైనపుబొమ్మ'గా అవకాశం పొందిన 8వ బాలీవుడ్ నటి. అంతేకాక ట్రస్టు ద్వారా సమాజసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాగా చారిటీ ద్వారా అనాథ శిశువుల సంక్షేమానికి పాటుపడుతున్నారు.

టీబీ డ్యాంలో 33 టీఎంసీల నీటి నిల్వ



బొమ్మనహాళ్, జూలై 15: తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ సోమవారానికి 33.07 టీఎంసీలకు పెరిగింది. ఇన్‌ఫ్లో 16,142 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 211 క్యూసెక్కులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. జలాశయం పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో తుంగభద్రకు చేరాల్సిన వరదనీరు ఆశించిన స్థాయిలో రావడం లేదు. గత వారం వచ్చిన వరదనీరు ప్రస్తుతం తగ్గడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

టమోటా కిలో రూ.48



అనంతపురం రూరల్, జూలై 15: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.48తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. సోమవారం 150 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.38, కనిష్ఠ ధర రూ.25 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.18వేలు



అనంతపురం రూరల్, జూలై 15: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18 వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.13వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 723టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నేడు గూగూడు కుళ్లాయిస్వామి పెద్ద సరిగెత్తు

నార్పల, జూలై 15: రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన గూగూడు కుళ్లాయిస్వామి పెద్ద సరిగెత్తు మంగళవారం జరగనున్నట్లు ఆలయ ఈఓ శోభా తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం కుళ్లాయిస్వామికి విడిది కార్యక్రమం నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో వచ్చి అంజనేయ స్వామి, కుళ్లాయిస్వామిని దర్శించుకున్నారు. భారీగా భక్తులు హాజరయ్యే పెద్దసరిగెత్తు కార్యక్రమానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 17న జలధి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్, జూలై 15: జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం వర్షం కురిసింది. అనంతపురం, యాడికి, శింగనమల, పామిడి, బెళుగుప్ప, తాడిపత్రి, గుంతకల్లు, గుత్తి, గార్లదిన్నె, పుట్లూరు తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. జిల్లాలోని 15 మండలాల్లో ఆదివారం రాత్రి వర్షం పడింది. కళ్యాణదుర్గంలో 7.4 మి.మీ వర్షపాతం నమోదైంది. వజ్రకరూరు 5.2, బొమ్మనహాళ్, గుంతకల్లులో 4.4, డీ.హీరేహాళ్, యాడికి, తాడిపత్రిలో 4.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా ప్రాంతాల్లో 3.2 మి.మీలోపు వర్షపాతం నమోదైంది.

డిగ్రీలో 77శాతం మంది పాస్

అనంతపురం సెంట్రల్, జూలై 15: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ ఆరో సెమిస్టర్‌లో 77శాతం మంది విద్యార్థులు పాస్ అయ్యారు. పరీక్షల నిర్వహణ విభాగాధిపతి జీవీ రమణ ఆధ్వర్యంలో రెక్టార్ వెంకట నాయుడు, రిజిస్ట్రార్ లక్ష్మయ్య సోమవారం ఫలితాలను విడుదల చేశారు. బీఏ, బీకామ్, బీసీఏ, బీబీఏ, బీఎస్సీ విద్యార్థులకు ఏప్రిల్‌లో ఆరో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించామన్నారు. మొత్తం 10906 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 8468మంది పాస్ అయ్యారని తెలిపారు.

గుణాత్మక విద్యతోనే ఉత్తమ సమాజ నిర్మాణం

శిడ్లఘట్ట, జూలై 15: ఉత్తమ విద్యతోనే ఉత్తమ సమాజ నిర్మాణం సాధ్యమని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని డాల్ఫిన్స్ విద్యాసంస్థలోని సీబీఎస్‌ఈ విభాగంలో పాఠశాల మాక్ పార్లమెంట్‌లో ఎంపికైన విద్యార్థులచే ప్రమాణస్వీకారం చేయించి మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలన్నారు. సమాజం మంచి కోసం తమ వంతు కృషి చేయాలన్నారు. ఇదే సందర్భంగా ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. విద్యాసంస్థ ఎండీ అశోక్ మాట్లాడుతూ పిల్లల్లో సామాజిక చైతన్యం కల్పించేలా మాక్ పార్లమెంట్ నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నాగరాజ్ మాట్లాడుతూ పిల్లల ప్రగతికి టెలివిజన్, మొబైల్‌లు అడ్డంకిగా మారాయన్నారు. సాంకేతిక విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తు కోసం ఉన్నత హోదాల కోసం ఇప్పటినుంచి కృషి చేయాలన్నారు. ఉత్తమ జ్ఞానార్జనకోసం తల్లిదండ్రులు కూడా తగిన సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్‌సీసీ కమాండర్ శివకుమార్ మాట్లాడుతూ ఎన్‌సీసీలో పొందే శిక్షణను దేశ రక్షణకోసం ఉపయోగించుకోవాలన్నారు. రిజర్వేషన్ ద్వారా పొందే సౌలభ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ రంగా సాధకులను, ఉత్తమ కన్నడ సాధక టీచర్ గ్రహీత ఎన్ రామాంజిన సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ పాలనాధికారి చందన అశోక్, ప్రిన్సిపాల్ మునికృష్ణప్ప, వ్యాయామ ఉపాధ్యాయుడు భరత్ తదితరులు పాల్గొన్నారు.



సాధకుడిని సన్మానిస్తున్న ప్రముఖులు

స్కాలర్‌షిప్‌ల పంపిణీ



స్కాలర్‌షిప్‌లతో విద్యార్థులు, నిర్వాహకులు

విజయపుర, జూలై 15: దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని నగర్త యువక సంఘం ఆధ్వర్యంలో 25వ వార్షిక స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ముఖ్యులుగా పాల్గొన్న కేపీసీసీ కార్యదర్శి మంజునాథ్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ యుగంలో మొబైల్ వాడకం తప్పనిసరి అయ్యిందని అయితే విద్యార్జనకు సంబంధించిన అంశాలు తెలుసుకోవాలని, మొబైల్‌కు బానిస కారాదని పిల్లలకు హితవు పలికారు. విదేశాలలో ప్రాథమిక దశనుంచే సాంకేతిక శిక్షణలు ఇస్తారని మనదేశంలో అంతటి సౌలభ్యం లేదన్నారు. ప్రగతి విద్యాసంస్థల ఎంపీ కృపాశంకర్ మాట్లాడుతూ విద్యార్థిదశలో పదో తరగతి కీలకమని కావున ఎస్‌ఎస్‌ఎల్‌సీలో మంచి మార్కులు సాధించడంతో ఉన్నత లక్ష్యంతో చదవాలన్నారు. ఇందుకు తొమ్మిదో తరగతినుంచే మానసికంగా సంసిద్ధత కావాలన్నారు. నగర్త యువక సంఘం 1999లో ఏర్పాటైందని ఏటా ఎస్‌ఎస్‌ఎల్‌సీ, పీయూసీలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారం, ఐదో, తొమ్మిదో తరగతి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నట్టు తెలిపారు. సంఘం కార్యకలాపాలు నచ్చి సుమారు 70మంది దాతలు, ఇంకా పీఆర్ నాగరాజప్ప స్మరణార్థం కౌసల్య నాగరాజ్ లక్ష రూపాయలు స్కాలర్‌షిప్‌కు, ఆరోగ్య నిధికి మరో లక్ష ఇస్తున్నారన్నారు. బెంగళూరు నివాసి పుట్టరాజ్ స్మరణార్థం జగదాంబ ఆరోగ్యనిధికి 50వేలు, స్కాలర్‌షిప్‌కోసం రూ.50వేలు ఇస్తున్నారన్నారు. డేటా అండ్ సైన్స్ విభాగంలో సేవలకు రోటరీ స్కూల్ సీనియర్ టీచర్ కళావతి, గౌరవ డాక్టరేట్ పొందిన డాక్టర్ సంతోష్‌కుమార్‌ను సత్కరించారు. సుమారు 70 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందచేశారు. దాతలు కౌలస్యనాగరాజ్, జగదాంబ పుట్టరాజ్‌లను సన్మానించారు. కోరమంగల రుద్రప్ప ట్రస్టు అధ్యక్షుడు సి భాస్కర్, గౌరవ కార్యదర్శి అమర్, సహ కార్యదర్శి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠాలతోపాటు సంస్కారం ముఖ్యం

బాగేపల్లి, జూలై 15: పిల్లలకు పాఠశాలలో నేర్పించే పాఠాలతోపాటు ఇంట్లో పెద్దలు నేర్పించే సంస్కారం ముఖ్యమని చిక్కబళ్ళాపుర శాఖ మఠం మంగళనాథ స్వామిజీ అభిప్రాయపడ్డారు. బాగేపల్లి పట్టణంలోని బీజీఎస్ పబ్లిక్‌స్కూల్‌లో సోమవారం ఏర్పాటైన జ్ఞానాంకుర కార్యక్రమంలో పాల్గొని పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు దేశ ఆస్తి అని వారి భవిష్యత్తుకోసం తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని ఉంటారన్నారు. ఈ నేపథ్యంలో ఆధునిక యుగంలో ప్రాథమిక దశ నుంచి మంచి చెడులు నేర్పించాలన్నారు. తల్లిదండ్రులే తొలి గురువులని, ఉపాధ్యాయుల ప్రోత్సాహం కూడా ఉండాలన్నారు. బిజిఎస్ విద్యాసంస్థల పాలనాధికారి డాక్టర్ ఎన్ శివరామరెడ్డి మాట్లాడుతూ కారణం ఏదైనా చిన్న పిల్లలకు మొబైల్ అలవాటు చేయించరాదన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



జ్ఞానాంకుర కార్యక్రమంలో మంగళనాథ స్వామిజీ తదితరులు

అన్నదాసోహానికి 101 బియ్యం బస్తాలు



సేకరించిన బియ్యం బస్తాలతో వ్యాపారులు తదితరులు

చింతామణి జూలై 15: తాలూకాలోని శ్రీక్షేత్రం కైవార యోగి నారేయణ మఠం ఏటా గురుపూజణమను పురస్కరించుకుని మూడు రోజులపాటు సంగీతోత్సవం నిర్వహిస్తోంది. ఇందుకు విచ్చేసే వేలాదిమంది భక్తుల అన్నదాసోహానికి చింతామణి ఏపీఎంసీ మార్కెట్ మాజీ డైరెక్టర్ శ్రీనివాస్ నేతృత్వంలో 101 బియ్యం ప్యాకెట్‌లను సేకరించి కైవారకు తరలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, ఫిటేల్ దయానంద్ మాట్లాడుతూ బలిజ సామాజికవర్గీయులు ఇతర దాతల సాయంతో సోనామసూరి బియ్యం బస్తాలను సేకరించామన్నారు. సంగీతోత్సవానికి కర్ణాటక నుంచే కాకుండా పొరుగున ఉండే ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన, వివిధ ప్రాంతాల కళాకారులు విచ్చేస్తారన్నారు. మఠంలో నిర్వహించే పలు కార్యక్రమాల్లో అన్నదాసోహం కూడా ఒకటన్నారు. వేర్వేరు ప్రాంతాలనుంచి తాతయ్య మఠానికి బియ్యం విరాళం ఇస్తుంటారని అయితే మూడు రోజుల సంగీతోత్సవానికి వేలాదిమంది భక్తులు తరలిరానుండడంతో ఆమేరకు తమవంతుగా బియ్యాన్ని కానుకగా సమర్పించామన్నారు. ఈ సందర్భంగా వ్యాపారులు జయరామప్ప, చలపతి, బ్యాటసత్తి, గ్యాస్ మురళి, ఫిటేల్ రాజు, సుమంత్, సుప్రీత్, హనుమంత, నంజుండప్ప, లక్ష్మణ్, వి.కె.బాబు, పుంగనూరు హరి తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నియంత్రణకు చర్యలు

బంగారపేట, జూలై 15: డెంగీ జ్వరం ప్రబలకుండా దోమల నియంత్రణకై చర్యలు చేపట్టాలని కేతగానహళ్ళి గ్రామపంచాయతీ అధ్యక్షురాలు మంజుళా అధికారులకు సూచించారు. తాలూకాలోని కేతగానహళ్ళిలో సోమవారం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటైన సమావేశంలో అధికారులకు పలు సలహా సూచనలు చేశారు. స్వచ్ఛత పాటించడంతోపాటు దోమలు ప్రబలకుండా పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాలలో మందులు పిచికారీ చేయాలన్నారు. కొన్ని చోట్ల నీటి సమస్య ఉందని వెంటనే పరిష్కరించాలని, వీధిదీపాలు అమర్చాలన్నారు. పల్లెల్లో త్వరలోనే నరేగా కింద పనులు చేపడతామన్నారు. సమావేశంలో నోడల్ అధికారి యువరాజ్, గ్రామపంచాయతీ ఉపాధ్యక్షురాలు రాధమ్మ, సభ్యులు రేణుకా, అరుణ, మంజునాథ్, సుబ్రమణి, సుమిత్ర, ప్రేమలతా, నటరాజ్, శ్రీధర్, రవి, వెంకటేశ్, వెంకటప్ప, నారాయణస్వామి, శశిధర్‌రెడ్డి, పీడీఓ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పంచాయతీ అధ్యక్షురాలు మంజుళా తదితరులు

రేపు ఆరోగ్య శిబిరం

దొమ్మసంద్ర, జూలై 15: ఆనేకల్ పురసభ మాజీ అధ్యక్షుడు ఎస్ఎన్ అశ్వథ్ నారాయణ చారిటబుల్ ట్రస్టు ఏర్పాటుపై సోమవారం సన్నాహక సభ నిర్వహించారు. ఈనెల 17న ట్రస్టు ప్రారంభం సందర్భంగా ఉచిత ఆరోగ్య శిబిరం, రక్తదాన శిబిరం, ప్రముఖ వీధుల నామఫలకాలకు ఆధునీకరణ చేపడతామన్నారు. కిద్వాయ్ ఆసుపత్రి నుంచి రక్తనిధి విభాగం, ఆక్స్‌ఫర్డ్ ఆసుపత్రి నుంచి గైనకాలజీ, న్యూరో స్పెషలిస్ట్‌లతోపాటు బీపీ, షుగర్, ఈసీజీ వంటి పరీక్షలు చేస్తారన్నారు. నిసర్గ దృష్టిధామ నుంచి కంటి పరీక్షలు అవసరమైనవారికి కళ్లద్దాలు పంపిణీ చేస్తామన్నారు. మీడియా సమావేశంలో పురసభ మాజీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, దేవరాజ్, లోకేశ్‌గౌడ, సమాజసేవకులు గణేశ్, గిరీశ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమ వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

ఘనంగా ముత్యాలమ్మదేవి పల్లకి ఉత్సవం

మహదేవపుర, జూలై 15: నియోజకవర్గంలోని హూడి తిగళరపాళ్యలో ముత్యాలమ్మదేవి, శివపార్వతుల పల్లకి ఉత్సవం ఘనంగా జరిగింది. సమాజ సేవకుడు హూడి చిన్ని నేతృత్వంలో గ్రామస్తుల సహకారంతో కార్యక్రమాలు సాగాయి. ఉత్సవంలో వీరగాసె, డొళ్ళుకుణిత, డప్పు వాయిద్య కళాబృందాలు పాల్గొనగా వందలాదిమంది భక్తులు ఊరేగింపులో భాగస్వామ్యులయ్యారు. అనంతరం సప్త మాతృకల పుణ్యక్షేత్రానికి ఊరేగింపు చేరింది. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప ప్రాంతంలో వెలసిన సప్తమాతృకల పుణ్యక్షేత్రానికి ఏటా వెళ్లి ఆరాధించి ముత్యాలమ్మదేవికి కుంకుమ సమర్పించే ఆనవాయితీ ఉందన్నారు. 101 కొలనులనుంచి దివ్యతీర్థాన్ని సేకరించి అభిషేకం చేస్తామన్నారు. ఈ సందర్భంగా బీఎస్ఎస్ ప్రముఖులు కిట్టి, ఆంజినప్ప, మునిరాజ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



పురవీధులలో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పంచాయతీ సమావేశంలో సమస్యల వెల్లువ



సమావేశంలో పాల్గొన్న సభ్యులు, అధికారులు

దొమ్మసంద్ర, జూలై 15: ఆనేకల్ తాలూకాలోని హెన్నాగెరె గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో 2024-25 వార్షిక సంవత్సర తొలి సమావేశాన్ని సోమవారం నిర్వహించగా ప్రజలనుంచి సమస్యల వినతులు వెల్లువెత్తాయి. మునేశ్వరస్వామి ఆలయ సమీపాన ఏర్పాటైన సమావేశానికి గ్రామపంచాయతీ అధ్యక్షులు మహేశ్ ఆర్, ఉపాధ్యక్షురాలు లక్ష్మీ ఎం అధ్యక్షత వహించారు. వివిధశాఖల ద్వారా అమల వుతున్న కార్యక్రమాలు, పథకాల గురించి అధికారులు వివరించారు. ప్లాస్టిక్ రహిత గ్రామంగా, వర్షపునీటి సేకరణలో నెంబర్‌వన్‌గా నిలిచేలా కార్యాచరణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎండిన బోరుబావులను మూసివేయాలని, బాలకార్మిక పద్ధతికి స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు. పిల్లలను పాఠశాలలకు పంపాలన్నారు. ప్రకృతి వనరులను కాపాడుకుందామన్నారు. గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు హెచ్‌జే ప్రసన్నకుమార్ మాట్లాడుతూ గ్రామ సభలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. హిన్నాకి గ్రామస్తులు తమ ఊరికి బీఎంటీసీ సదుపాయం కల్పించాలని కోరారు. సభ్యులంతా కలసి గ్రామంలోని చెరువులు కలుషితం కాకుండా ప్రభుత్వానికి లేఖలు రాసినా స్పందన కరువైందని ఆక్రోశం వ్యక్తం చేశారు. ఇకనైనా స్పందించేలా చొరవ చూపాలని డిమాండ్ చేశారు. గ్రామసభలో సభ్యులు ప్రసన్నకుమార్, నాగరాజ్, ఎం కుమార్, ఎస్ భాగ్య, ఆర్ కాంతరాజు, ఎం భవాని చంద్రకళ, పుష్ప, చూడమ్మ, శివమ్మ, పీడీఓ, కార్యదర్శి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడుతున్న దంపతుల అరెస్టు

▸▸ బాడుగ ఇంటి నెపంతో చోరబాటు



అరెస్టు అయిన దంపతులు వీరే

బెంగళూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బాడుగ ఇంటి కోసం వెతుకుతున్నట్టు నటిస్తూనే ఒంటరిగా ఉండే మహిళను టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడుతున్న దంపతులను మైసూరు నగరం హెబ్బాళ పోలీసులు అరెస్టు చేశారు. బాడుగ ఇల్లు అడిగేందుకు వెళ్లి దొంగతనానికి పాల్పడిన చిత్రదుర్గకు చెందిన వనిత (24), చేతన్ (29) లను అరెస్టు చేశారు. ఈనెల 10న హెబ్బాళ్ 1వ స్టేజ్‌లో రిటైర్డు టీచర్ శాంతమ్మకు సంబంధించి ఖాళీగా ఉన్న ఇంట్లో బాడుగకోసం అంటూ దంపతులు వెళ్లారు. వారిని ఇంట్లోకి ఆహ్వానించి అడ్వాన్స్ ఇతర విషయాలు చర్చించారు. ఆ తర్వాత ఏటీఎంకు వెళ్లి నగదు తెస్తామం టూ కాసేపటి తర్వాత వెనుతిరిగి వచ్చారు. గూగుల్ పే, ఫోన్ పే ఉంటూ నగదు బదిలీ చేస్తామన్నారు. రిటైర్డు టీచర్ శాంతమ్మ తన వద్ద అటువంటివి ఏవీ లేవన్నారు. అలసటగా ఉందని కాసేపు విశ్రాంతి తీసుకుంటామని దంపతులు కోరారు. అందుకు శాంతమ్మ అంగీకరించారు. అంతలోనే శాం తమ్మ మార్కెట్‌కు వెళ్లి కూరగా యలు తీసుకొచ్చారు. ఇంట్లోనే ఉన్న వారిద్దరూ ఇక మేం బయల్దేరు తామంటూ చెప్పారు. శాంతమ్మ వంటగదిలోకి నీరు తాగేందుకు వెళ్లగా వెనుకనుంచే వెళ్లిన దంపతులు ఒక్కసారిగా ఆమెను కట్టిపడేసి బంగారు ఆభరణాలను దోచుకున్నారు. ఆ తర్వాత కళ్లల్లో కారంపొడితోపాటు ఇతర మందులు చల్లి ఆమె స్పృహ కోల్పోయేలా చేసి పరారయ్యారు. కాసేపటి తర్వాత తేరుకున్న శాంతమ్మ విషయాన్ని కోడలికి తెలిపారు. ఆమె హెబ్బాళ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఖతర్నాక్ దంపతులను ఎట్టకేలకు అరెస్టు చేసినట్టు మైసూరు నగర పోలీస్ కమిషనర్ సీమా లాట్కర్ సోమవారం ప్రకటించారు.

మామాడి కాయల చోరీ

చింతామణి, జూలై 15: తాలూకాలోని మురగమల్ల గ్రామ పంచాయతీ అధ్యక్షుడు 52ఏళ్ల అన్సర్‌ఖాన్‌కు చెందిన మామిడితోపులో కాయలు చోరీ అయ్యాయి. ఈ మేరకు అన్సర్‌ఖాన్ చింతామణి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భత్రలహళ్ళి సర్వే 25లో 10ఎకరాలలో మామిడితోటను గత ఏడాది డిసెంబరులో కొనుగోలు చేశానని, కాయలు ఇటీవల దిగుబడి బాగా వచ్చిన వేళ నెల రోజులకుపైగా పలుమార్లు చోరీకి గురైనట్టు గుర్తించానన్నారు. శనివారం రాత్రి స్నేహితులతో కలసి తోటలో కాపలా ఉండగా కొంతమంది సుమారు 11.30 గంటలకు వచ్చారని తమను చూసి పరారయ్యారన్నారు. అయితే తెల్లవారుజామున 5గంటలకు అలికిడి రావడంతో గమనించగా అప్పటికే మూటలలో సేకరించిన మామిడికాయలతో టెంపోతో పరారయ్యారన్నారు. తాము వెంటాడడంతో చింతామణి - శ్రీనివాసపుర రోడ్డులోని మాడికెరె క్రాస్ సమీపానగల అమరనాథ్ అనే మండిలో చోరీ చేసిన కాయలను అన్‌లోడ్ చేసి వెళ్లినట్టు గుర్తించామన్నారు. మండి నిర్వాహకులకు ఫోన్ చేసి విచారించగా మూడు నెలలుగా డాన్ నాగేశ్ అనే వ్యక్తి మామిడికాయలు తమ మండికి ఇస్తున్నట్టు తెలిపారన్నారు. ఇప్పటివరకు సుమారు లక్ష రూపాయల విలువైన కాయలు విక్రయించినట్టు తెలుస్తోందన్నారు. దీంతో చోరీ చేసిన డాన్ నాగేశ్‌పైనా, చోరీ వస్తువు కొనుగోలు చేసిన మండి నిర్వాహకులు అమరనాథ్‌పైనా ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ముడా అవినీతిపై ఏకసభ్య కమిషన్



బెంగళూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా)లో ఇంటి స్థలాల పంపిణీలో అవినీతిపై హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి పిఎన్ దేశాయ్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఆదేశాలు జారీ చేసింది. ఆరో పణలకు సంబంధించి సమగ్ర దర్యాప్తు జరిపి ఆరు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశాలలో సూచించారు. సమగ్ర సమాచారం, రికార్డులను సమకూర్చడం, కమిషన్ విచారణకు సాంకేతిక ఆర్థిక పాలనాపరమైన సలహాలను ఇచ్చేందుకు నగరాభివృద్ధిశాఖ, మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార సహకరించాలని ఆదేశాలలో సూచించారు. కమిషన్ విచారణల వేళ అవసరమైన అన్ని రికార్డులను ముడా సంపూర్ణంగా సమర్పించాలని సూచించింది.